ప్రజాశక్తి
శుక్రవారం 25 అక్టోబర్ 2024
5
శ్రీ సత్యసాయి





చెరువు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

వేగవంతంగా నేషనల్ హైవే, రైల్వేలైన్ పనులు

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లాలో ఉన్న నేషనల్ హైవే, రైల్వే నిర్మాణ పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే , రైల్వే లైన్ పనుల పురోగతిపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, రైల్వే పనులను ఉద్దేశపూర్వకంగా ఎవరైనా అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదివరకే భూసేకరణ చేసిన నేపథ్యంలో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పరిహారం చెల్లింపు విషయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరుగకూడదని తెలిపారు. కోర్టు కేసులపై దృష్టి సారించి పరిష్కార మార్గాల చర్యలు తీసుకోవాలన్నారు. పూర్తిస్థాయిలో పరిహారం అందించినప్పటికిని రహదారి నిర్మాణంలో ఆటంకాలు ఎదురైతే క్షేత్రస్థాయిలో సంబంధిత ఆర్డీవోలు, తహశీల్దార్లు ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యలను పరిష్కరించాలన్నారు. అక్టోబర్ 31 లోగా పెండింగ్ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సోమందేపల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణపు పనులకు సంబంధించి మలుగూరు పాలసముద్రం రైతులకు చెల్లించవలసిన నష్టపరిహారపు పనులు పూర్తి చేయాలన్నారు. 342-2 ప్యాకేజికి సంబంధించి గోరంట్ల మండలం బుదిలి గ్రామంలో పాఠశాల భవనం కొద్దిగా రోడ్డు నిర్మాణం నిమిత్తం పోతున్న కారణంగా దీనిపై ఎన్‌హెచ్ అధికారులు, తహశీల్దార్ చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలన్నారు. బెంగళూరు- కడప- విజయవాడ రహదారి నిర్మాణం విషయంలో ముదిగుబ్బ మండలం మలకవేముల గ్రామంలో ఉన్న సమస్య విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని ధర్మవరం ఆర్డీవో, నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. ఈ నెల చివరిలోగా ఖాళీగా ఉన్న రోడ్లకు పోయే ప్రభుత్వ పట్టా భూముల సమస్యలను నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు భూమిని అప్పగించే విధంగా సంబంధిత ఆర్డీవోలు, తహశీల్దార్లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నేషనల్ హైవే 716 ప్యాకేజీ బి.కొత్తపల్లి, గోరంట్లకు సంబంధించి రెడ్డివారిపల్లి రైతులకు వీలైనంత త్వరగా నష్టపరిహారం అందించాలన్నారు. బెంగళూరు - కడప విజయవాడ ప్రాజెక్టు డైరెక్టర్ నేషనల్ హైవే తరఫున ప్రభుత్వానికి పంపుతున్న నివేదికల్లో వాస్తవ విషయాలను సక్రమంగా సమర్పించాలని ఆదేశించారు. తలుపుల మండలంలో చాలామందికి భూనష్టపరిహారం అందలేదని ఫిర్యాదులు వస్తున్నందున కదిరి ఆర్డీవో, తలుపుల తహశీల్దార్లు ఈ విషయంలో వెంటనే స్పందించి నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నేషనల్ హైవే 342-1 కు సంబంధించి ముదిగుబ్బ మండలంలోని మంగళమడకలో శ్మశాన వాటిక సమస్య ఉన్న కారణంగా ప్రత్యామ్నాయ స్థలం కేటాయింపుకు చర్యలు తీసుకోవాలని ధర్మవరం ఆర్డీవో, తహశీల్దార్‌కు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు సువర్ణ, ఆనంద్, శర్మ, మహేష్, తహశీల్దార్లు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

పంటలబీమా ప్రీమియం రైతులే చెల్లించాలి

పంటల బీమా పథకం అమలు తీరుపై వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ బి.రాజశేఖర్ అన్ని జిల్లాల కలెక్టర్లు వ్యవసాయ శాఖ జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో గురువారం రాష్ట్ర రాజధాని నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ టిఎస్.చేతన్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల బీమా పథకానికి రైతులే ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. డిసెంబర్ 15వ తేదీ నాటికి పంటల బీమా నమోదు ప్రక్రియ ముగించాలన్నారు. సిఎస్‌సి సెంటరు లేదా సచివాలయాలకు వచ్చి రైతులు ప్రీమియాన్ని చెల్లించవచ్చన్నారు. సిసిఆర్‌సి కార్డుదారులకు లబ్ధి చేకూర్చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంద న్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, పశుసంవర్ధక శాఖ జెడి శుభదాస్, ఎల్‌డిఎం రమణ కుమార్ పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోండి

◆ కలెక్టర్ చేతన్‌ను కోరిన ఎమ్మెల్యే సునీత

◆ కనగానపల్లి చెరువు, నీటమునిగిన పంటల పరిశీలన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

అనుకోకుండా వచ్చిన వరదలతో రాప్తాడు నియోజకవర్గంలో పంటలకు అపార నష్టం వాటిల్లిందని, చాలామంది ఇళ్ళు కోల్పోయారని వారందరినీ ఆదుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత కలెక్టర్ టిఎస్.చేతన్‌ను కోరారు. రాప్తాడు నియోజకవర్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కనగానపల్లి మండల కేంద్రంలో చెరువు తెగిపోయింది. తెగిన చెరువు కట్ట, నీట మునిగిన పంట పొలాలను కలెక్టర్, ఎమ్మెల్యేలు గురువారం పరిశీలించారు. గ్రామస్తులు, రైతులతో మాట్లాడి నష్టం వివరాలను తెలుసుకున్నారు. కనగానపల్లి చెరువు మరమ్మత్తులకు రూ.50 లక్షల వరకు ఖర్చు అవుతుందని ఈ నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో భారీ వర్షాలు వరదల కారణంగా వేలాది ఎకరాల్లో పంటలను రైతులు నష్టపోయారన్నారు. వీటన్నిటికీ పరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రెడ్డిపారికుంట కెపాసిటీ మొత్తం 21 వేల క్యూసెక్కులు అన్నారు. ఒక్కసారిగా 30వేల క్యూసెక్కుల నీరు రావడంతో కట్ట తెగిపోయిందన్నారు. కనగానపల్లి మండలంలో 188 మిల్లీమీటర్ల వర్షం కురిసిందన్నారు. దీని వల్లే చెరువు కట్ట తెగినట్లు వివరించారు. మరమ్మతులకు సంబంధించి ఇరిగేషన్ శాఖ అధికారులకు తగిన ఆదేశాలిచ్చామన్నారు. శాశ్వత ప్రాతిపదికన చెరువుకు మరమ్మత్తులు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీవో మహేష్, జలవనరుల శాఖ ఎస్ఈ విశ్వనాథ్, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కూలిన ఇల్లు.. తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని కేతగానిచెరువు పంచాయతీ పరిధిలోని సుద్దుకుంటపల్లి గ్రామంలో గురువారం తెల్లవారుజామున ఉప్పర అంజనప్ప కుమారుడు హనుమంతు ఇల్లు కూలిపోయింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. పాత మట్టి మిద్దె కావడం, ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు బాగా గోడలు, పైకప్పు బాగా తడిశాయి. దీనికి తోడు గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి ఇల్లు కూలింది. హనుమంతు భార్య, పిల్లలు, తల్లి మొత్తం ఐదుగురు సభ్యులు ఇంటి ముందు రేకులతో వేసిన వరండాలో నిద్రించారు. గురువారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి ఇల్లు కూలింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో వారు ఊపిరిపీల్చుకున్నారు. అయితే ఇంట్లో నిల్వం ఉంచిన బియ్యం, రాగులు, వడ్లు, తదితర నిత్యావసర వస్తువులతో పాటు బీరువా, వంట సామగ్రి, సామాన్లు శిథిలాల కింద పడి ఉండిపయాయి. సుమారు రూ. లక్ష వరకూ నష్టం వాటిల్లింది. గొర్రెల కాపరిగా జీవనం కొనసాగిస్తున్న తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరింది.



కూలిన ఇంటి వద్ద యజమాని హనుమంతు

డిఇఒగా క్రిష్టప్ప

ప్రజాశక్తి - కొత్తచెరువు

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన డీఈవోలు, డిప్యూటీ డీఈవోల బదిలీల్లో భాగంగా ప్రొద్దుటూరు డిప్యూటీ డివైఇఒగాఉన్న క్రిష్టప్పను సత్యసాయి జిల్లా డిఇఒగా ప్రభుత్వం నియమించింది. ధర్మవరం డివైఈవో గా ఉంటూ శ్రీ సత్య సాయి జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు నిర్వహించిన మీనాక్షిని వైయస్సార్ జిల్లా ప్రొద్దుటూరు డివై ఈవోగా బదిలీ చేశారు.





తహాశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న లోక కళ్యాణ్ ప్రజాసాక్షి సభ్యులు

స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-గుడిబండ

మండల కేంద్రమైన గుడిబండలో ప్రధాన కూడళ్లలో మహాత్మగాంధీ, సుభాష్‌చంద్రబోస్, బాల గంగాధర్ తిలక్, వడ్డే ఓబన్న, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, ఝాన్సీరాణి, లక్ష్మీబాయి, లాలా లజపతిరాయ్, చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్, తదితర స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం లోక కళ్యాణ్ ప్రజాసాక్షి ఆధ్వర్యంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో లోక కళ్యాణ్ ప్రజా సాక్షి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో టిడిపి పట్టణ అధ్యక్షుడు మృతి

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎంపి, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

టిడిపి పట్టణ అధ్యక్షుడు మనోహర్ గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎంపి బికె.పార్థసారధి, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి, పార్టీ జిల్లా అధ్యక్షులు అంజనప్ప, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి వారింటికి వెళ్లి మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారు మాట్లాడుతూ మనోహర్ నీతి నిజాయితీగా టిడిపి అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. అలాగే మనోహర్ పాడే మోసి అంత్యక్రియలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కుంచితి ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ వి.ఎం.పాండురంగప్ప, టిడిపి మండల కన్వీనర్లు దాసిరెడ్డి, గణేష్, కుమార్‌స్వామి, మద్దనకుంటప్ప, లక్ష్మీనారాయణ, జిల్లా వ్యాప్తంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



టిడిపి పట్టణ అధ్యక్షుడు మనోహర్ అంత్యక్రియల్లో పాల్గొన్న ఎంపి పార్థసారధి, ఎమ్మెల్యే రాజు, గుండుమల తిప్పేస్వామి, శ్రీనివాసమూర్తి, తదితరులు



బోయ నరసింహులు



టి.హరికృష్ణ

ఆర్ఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, సెక్రటరీల ఎంపిక

ప్రజాశక్తి-రొద్దం

విజయవాడలోని ఆర్ఈఎఫ్ కార్యాలయంలో గురువారం రిజర్వేషన్ ఎంప్లాయిస్(బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ) ఫెడరేషన్ సమావేశం నిర్వహించారు. అందులో రిజర్వేషన్ వర్గాలకు చెందిన ఉద్యోగుల సమస్యలు తెలుసుకుని పరిష్కారంపై చర్చించారు. అలాగే బిఆర్.అంబేద్కర్, మహాత్మ జ్యోతిబా పూలే ఆశయాల సాధన కోసం రిజర్వేషన్ విభాగం అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలనే అంశంపై చర్చించి తీర్మానించారు. అనంతరం రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా మండలంలోని నారనాగేపల్లి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బోయ నరసింహులు, జిల్లా సెక్రటరీగా టి.హరికృష్ణలను నియమించారు. ఈ మేరకు వారికి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హెచ్ రామచంద్ర, ఎండి నాగభూషణం ఆదేశాల మేరకు నియామక పత్రాలు జారీ చేసినట్లు వారు తెలిపారు. నరసింహులు, హరికృష్ణలను తోటి సచివాలయ ఉద్యోగులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. టి.హరికృష్ణ మండలంలోని చోలెమర్రి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుడిబండ

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గుడిబండ, అమరాపురం పోలీస్ స్టేషన్ల పరిధిలోని పోలీసుల ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు. వైద్య శిబిరంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు కంటి పరీక్షలు చేస్తారన్నారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని బెంగుళూరులోని శంకర కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి వారికి అన్ని సదుపాయాలతో ఆపరేషన్ చేయించి ఆ తర్వాత అద్దాలు కూడా పంపిణీ చేసి మడకశిరకు తీసుకొచ్చి వదులుతామని తెలిపారు. ఫోన్ నంబర్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, 3 పాస్ ఫొటోలు తీసుకుని రావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంతంలోని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నీట మునిగిన పంటలు

ప్రజాశక్తి-రొద్దం

ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాలకు మండల వ్యాప్తంగా పలువురు రైతులు సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. గౌరాజుపల్లి గ్రామంలో 8 మంది రైతులకు చెందిన వరి, మొక్కజొన్న, కంది పంటలు దాదాపు 15 ఎకరాల్లో పూర్తిగా నీట మునిగడంతో నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు. రొద్దం గ్రామానికి చెందిన హరీష్ గౌరాజుపల్లి గ్రామం వద్ద ఐదెకరాల్లో వరి, మొక్కజొన్న పంటలు సాగు చేశాడు. ఇటీవల కురిసిన వర్షాలతో చేతకొచ్చిన మొక్కజొన్న పంట పూర్తిగా మునిగిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వరి పంట కూడా పూర్తిగా మునిగిపోవడంతో పంట చేతికందే పరిస్థితి లేదని వాపోయాడు. నీట మునిగిన పంటలను గురువారం అధికారులు కూడా పరిశీలించినట్లు రైతు తెలిపారు. పంట నష్టం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.



వరి పొలంలోకి చేరిన వర్షం నీరు



నీట మునిగిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు

సబ్ ట్రెజరీ కార్యాలయ ప్రాంగణంలో వర్షం నీరు

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని సబ్ ట్రెజరీ కార్యాలయ ప్రాంగణంలో పూర్తిగా వర్షం నీరు చేరింది. దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వెళ్లే అధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో సబ్ ట్రెజరీ కార్యాలయం, పాత తహశీల్దార్ కార్యాలయాల ప్రాంగణంలో పెద్దఎత్తున వర్షం నీరు నిలిచింది. దీంతో ఆయా కార్యాలయాల అధికారులు, సిబ్బందితో పాటు రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కార్యాలయాల ముందు వర్షం నీరు నిలబడకుండా తగిన ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



సబ్ ట్రెజరీ కార్యాలయ ప్రాంగణంలో నిలిచిన వర్షం నీరు

వాతావరణ వర్షపాత కేంద్రాల పనితీరు పరిశీలన

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలో ఉన్న ఆటోమేటిక్ వెదరేజ్ స్టేషన్ (వాతావరణ వర్షపాత కేంద్రాలు) పనితీరును విజయవాడ వాతావరణ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ మేరకు గురువారం మండలంలోని మాల్యవంతం, దంపెట్ల, చెన్నరాయపట్నం, బత్తలపల్లిలో ఉన్న వాతావరణ వర్షపాత కేంద్రాలను వాతావరణశాఖ సంబంధిత ఇంజనీర్ ఎస్పీ హేమంత్, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటప్రసాద్ పరిశీలించారు. ఈ నెల 15వ తేదీన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో దంపెట్ల సర్పంచి చల్లా కరుణాకర్ నాయుడు వాతావరణ వర్షపాత కేంద్రాల పనితీరుపై అధికారులను నిలదీశారు. ఇందుకు ఏవో డాక్టర్ కెవిఎస్ లక్ష్మీనరసింహశర్మ సమగ్రంగా వివరించారు. అయితే గురువారం సంబంధిత అధికారులు వచ్చి వాటి పనితీరును పరిశీలించారు. ఈ కేంద్రాల నుంచి ప్రతి గంటకు వాతావరణంలో ఉన్న వర్షపాతం, గాలిలోని తేమ శాతం, ఉష్ణోగ్రత. గాలి వేగం, గాలి దిశ తదితర వివరాలను సక్రమంగా శాటిలైట్ ద్వారా పంపుతోందా? లేదా? అనే విషయాన్ని గమనించినట్లు అధికారులు తెలిపారు. వీరు ప్రతి రెండు నెలలకు ఒక్కసారి వారు వచ్చి పరిశీలిస్తుంటారని వివరించారు.



తహశీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న సంజీవపల్లి గ్రామస్తులు

రైల్వే బ్రిడ్జిని మూసేయొద్దు

ప్రజాశక్తి - నల్లచెరువు

మండలంలోని సంజీవపల్లి వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జిని మూసి వేయొద్దని ఆగ్రామస్తులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ రవికుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా తమ పొలాలకు వెళ్లే దారి మూసి వేస్తే ఇబ్బందులు పడతామన్నారు. తమ పొలాలకు రాకపోకలు ఈ దారి మీదుగానే చేస్తున్నామని ఈ రైల్వే బ్రిడ్జి మూసివేస్తే తాము పండించిన పంటలను కూడా ఇంటికి తెచ్చుకోవడానికి ఇబ్బంది ఏర్పడుతుందని అన్నారు. ఈ విషయంపై సంబందిత అధికారులు పునరాలోచించి రైల్వే బ్రిడ్జ్ ను మూసివేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

కూటమి ప్రభుత్వంలోనే క్రీడా రంగం అభివృద్ధి

ప్రజాశక్తి - కొత్తచెరువు

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక క్రీడారంగం పరుగులు పెడుతోందని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్ మంచి రోజులు రానున్నాయని త్వరలోనే అన్ని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలలో సబ్ సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నామని ఆయన అన్నారు. శ్రీ సత్య సాయి జిల్లాలో సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు కేశినేని శివనాథ్‌ను జిల్లా క్రికెటర్స్ సంఘం నాయకులు విజయకుమార్ కోరారన్నారు. దీంతో స్పందించిన ఆయన గురువారం ఇన్ఫ్రాస్ట్రక్చర్ కమిటీని సత్యసాయి జిల్లాకు పంపి అక్కడ సబ్ సెంటర్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని చూడాలని ఆదేశించారన్నారు. స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి చొరవతో సబ్ సెంటర్ త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. త్వరలో కొత్తచెరువు మండల కేంద్రంలో సబ్ సెంటర్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తామని వారు తెలిపారు అలాగే ప్రతి రెండు నియోజకవర్గాలకు ఒక క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫ్రాస్ట్రక్చర్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, కడప జిల్లా క్రికెట్ స్టేడియం చైర్మన్ డాక్టర్ కేజీ గోవింద్ రెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ సాగర్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు కె రమేష్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడా మైదానం ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న విజయ్‌కుమార్, తదితరులు

రాష్ట్రస్థాయి పోటీలకు శాంతినికేతన్ విద్యార్థి

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పట్టణంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న జి.సాయిభవిత రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైందని కరస్పాండెంట్ జె.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో గురువారం ఆయన మాట్లాడుతూ విద్యార్థి సాయి భవిత నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకూ నెల్లూరులో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. పాఠశాల ప్రార్థన సమావేశంలో విద్యార్థిని అభినందించారు. భవిష్యత్తులో జాతీయ స్థాయికి ఎంపికై చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.



సాయిభవితతో కరస్పాండెంట్ శ్రీకాంత్

గలిబిపల్లిలో ఎన్టీఆర్ వైద్య సేవలు

లేపాక్షి : మండలంలోని గలిబిపల్లి గ్రామంలో గురువారం ఎన్టీఆర్ ఆరోగ్య రథం ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఉదయం స్థానిక టిడిపి నాయకుడు శివశంకర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామంలోని ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవతో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజన్న, దావూద్, తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ ఆరోగ్య రథం ద్వారా ప్రజలకు వైద్య సేవలందిస్తున్న టిడిపి నాయకులు

ఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

హిందూపురం మండలం ముదిరెడ్డిపల్లికి చెందిన ఒక ప్రేమ జంట జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చింది. ఈ సందర్భంగా ప్రేమికులు కీర్తి, షేక్షావలి మాట్లాడుతూ తాము మూడేళ్లగా ప్రేమించుకుంటున్నామని, ఒకరినొకరు ఇష్టపడి గురువారం ఉదయం పెళ్లి చేసుకున్నామని చెప్పారు. అయితే తమ కుటుంబాల నుంచి తమకు ప్రాణహాని ఉందని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులును కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. తమ ప్రేమ విషయం తెలిసి తమ ఇంట్లో పెద్దలు మరొకరికి ఇచ్చి ఎక్కడ పెళ్లి చేస్తారో అన్న భయంతో బుధవారం రాత్రి ఇంటి నుంచి వచ్చి గురువారం ఉదయం పెళ్లి చేసుకున్నామని తెలిపారు. తమ కుటుంబ సభ్యులు తమ కోసం గాలిస్తున్నారని వారి నుంచి తమకు ఎటువంటి సమస్య రాకుంటే తమ జీవనం సంతోషంగా సాగిస్తామని తెలిపారు.


ఎస్ఐకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

రూరల్ ఎస్ఐని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులును టిడిపి మండల నాయకులు గురువారం ఉదయం పోలీస్ స్టేషన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు ఎస్ఐకి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు మల్లకాల్వ రామ్మోహన్ రెడ్డి, రాజశేఖరరెడ్డి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల హర్షం

ప్రజాశక్తి - హిందూపురం

దేవాలయ కమిటీల్లో నాయీ బ్రాహ్మణులకు ప్రత్యేకంగా చోటు కల్పిస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడంపై నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు వారు సిఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి అంబేద్కర్ సర్కిల్ లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డి రమేష్ కుమార్, నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం కదిరి కుంట్ల పల్లి గ్రామపంచాయతీ కదిరికుంట్ల పల్లి దళిత వాడలో రూ. 20 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ జేఈ గుప్తా , పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - బుక్కపట్నం

ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ కృష్ణమూర్తి ఆదేశించారు. ఆటోడ్రైవర్లు మద్యం తాగి ఆటో నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గురువారం మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ మస్తాన్, పోలీసులు పాల్గొన్నారు.

ఉద్యోగార్థులకు మౌఖిక పరీక్షలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పలు ఉద్యోగాలకు మౌఖిక పరీక్షను పుట్టపర్తి ఐసిడిఎస్ కార్యాలయంలో జిల్లా అధికారులు గురువారం నిర్వహించారు. ధర్మవరం, హిందూపురం బాలసదన్ లో గల 12 వివిధ పోస్టులకు గతంలో నోటిఫికేషన్ వెలువడగా ఇటీవల కలెక్టర్ కార్యాలయంలో కంప్యూటర్ పరీక్షను నిర్వహించి అందులో ప్రతిభ కనబరిచిన మహిళా అభ్యర్థులకు గురువారం ఐసిడిఎస్ కార్యాలయంలో మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఈ మౌఖిక పరీక్షను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సోషల్ వెల్ఫేర్ అధికారి శివరంగ ప్రసాద్, ఐసిడిఎస్ పీడీ నాగ మల్లేశ్వరి, సిడబ్ల్యుసి మెంబర్ ఓబులపతి, జెజెబి మెంబర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇక్కడ మౌఖిక పరీక్షలు నిర్వహించిన వారికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నియామక ఉత్తర్వులు అందనున్నాయి.

డంపింగ్ యార్డ్‌ను తొలగించండి

ప్రజాశక్తి - తలుపుల

మండలంలోని బట్రేపల్లి పరిధిలో కదిరి పులివెందుల రోడ్డు మార్గాన రాజరాజేశ్వరి దేవాలయం పక్కన ఉన్న డంపింగ్ యార్డ్ ను తొలగించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు వారు గురువారం స్థానిక ఎంపీడీవో రామానాయక్‌ను కలిసి సమస్యను వివరించారు. అనంతరం వినతిపత్రం సమర్పించారు.


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు

శ్మశానవాటికలకు స్థలం చూపని అధికారులు

ప్రజాశక్తి - తనకల్లు

తనకల్లు మండల అధికారులు ఎమ్మెల్యే ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారని టిడిపి నాయకులు విమర్శించారు. ఈసందర్భంగా ఆపార్టీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు సోంపాల్యం నాగభూషణ మాట్లాడుతూ సెప్టెంబర్ 25వ తేదీన మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు పలు సమస్యలను తీసుకెళ్లారన్నారు. అందులో భాగంగా శ్మశానవాటికలకు స్థల సేకరణ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఆ సమయంలో స్పందించిన ఆయన మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి శ్మశానవాటికల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని తహశీల్దార్ శోభ సువర్ణమ్మను ఆదేశాలిచ్చారన్నారన్నారు. అయితే ఇంతవరకు ఈ విషయంలో రెవెన్యూ అధికారులు పట్టించుకోవటం లేదని విమర్శించారు. దాదాపు నెల కావస్తున్న ఇంతవరకు ఏ గ్రామంలోనూ శ్మశాన వాటికలకు స్థలాన్ని చూపలేదని జిల్లా టిడిపి బీసీ సెల్ ఉపాధ్యక్షుడు అన్నారు. మండల కేంద్రంలో దాదాపు 40 నాయి బ్రాహ్మణ కుటుంబాల ఉంటే వారిలో ఎవరైనా మృతిచెందితే ఎక్కడ ఖననం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ఇదేకాక మండల వ్యాప్తంగా దాదాపు 17 గ్రామ పంచాయతీల పరిధిలో అనేక గ్రామాలలో శ్మశాన వాటికలు లేవన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి శ్మశానవాటికల స్థలాల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పరిటాల శ్రీరామ్, తదితరులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

భారీ వర్షాలతో చేతికొచ్చిన పంటను నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. పుట్టపర్తిలో జిల్లా కలెక్టర్‌నుకలిసిన పరిటాల శ్రీరామ్ ధర్మవరం నియోజకవర్గ రైతుల, ప్రజల సమస్యలను వివరించారు. వరి, వేరుశనగ, ద్రాక్ష, ఇతర పంటలు పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయన్నారు. బయటికి కనిపించే దానికంటే క్షేత్రస్థాయిలో నష్టం ఎక్కువగా ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈనేపథ్యంలో వ్యవసాయ శాఖ సిబ్బందితో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయించి పంట నష్ట అంచనా వేసి వారికి ప్రభుత్వం తరపున నష్టపరిహారం, పంటల బీమా అందజేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా తుంపర్తి భూ బాధిత రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. గహనిర్మాణాల కోసం సేకరించిన వ్యవసాయ పొలాలకు పరిహారం అందక గత ఆరేళ్లుగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తుంపర్తిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన 90 మంది నిరుపేద కుటుంబాల నుంచి గృహ నిర్మాణాల కోసం 210 ఎకరాల భూమిని పోతులనాగేపల్లి రెవెన్యూ పరిధిలో సేకరించారన్నారు. ఒక ఎకరా పొలం రూ. 2 కోట్లు విలువ ఉన్న భూములకు, ఒక ఎకరాకు రూ. 5 లక్షల పరిహారం చెల్లిస్తామని చెప్పగా కొంతమంది రైతులు మాత్రం పరిహారం తీసుకోలేదన్నారు. మెజారిటీ శాతం రైతులు ఒప్పుకోకపోవడంతో ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా అడ్డుకున్న రైతులపై పోలీస్ కేసులు బనాయించిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అన్యాయంపై సంబంధిత రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా రైతులకు న్యాయం చేయమని ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పటినుంచి గత ప్రభుత్వం హయాంలో కూడా రైతులు స్థానిక తహశీల్దార్, ఆర్డీవో, కలెక్టర్, సెక్రటేరియట్ చుట్టూ తిరిగినా వారికి న్యాయం జరగలేదన్నారు. రెవెన్యూ మంత్రి శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి కలెక్టర్‌కు లేఖ పంపారన్నారు. ఈ అంశంపై పూర్తి వివరాలు పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని పరిటాల శ్రీరామ్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

వరద బాధితులకు 'పాంచజన్య' విరాళం

ప్రజాశక్తి - హిందూపురం

విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో భాగంగా తమ వంతు సహాయంగా రూ.2 లక్షల విరాళం అందజేసినట్లు పాంచజన్య పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు శ్రీనివాసులుతోపాటు పాఠశాల కరస్పాండెంట్ నందకుమార్ విరాళానికి సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవడానికి తన వంతు సహాయంగా పాంచజన్య పాఠశాల యాజమాన్యం ఈ విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు.

ప్రయివేటు పాఠశాలల చేయూత : విజయవాడ వరద బాధితుల కోసం హిందూపురం జోన్ ప్రయివేటు పాఠశాలల నిర్వాహకులు రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు అమరావతిలో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుకు సంబంధిత చెక్కును గురువారం అందజేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు హిందూపురం జోన్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ముందుకు రావడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాంచజన్య శ్రీనివాసులు, వేణుగోపాల్, రియాజ్ , నందకుమార్, ప్రసాద్, మూర్తి, కరియన్న, గోవిందరాజులు, అకిబ్ తదితరులు పాల్గొన్నారు.


సిఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - హిందూపురం

పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం స్థానిక ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సైబర్ నేరాలని అరికట్టడంలో యువత పాత్ర, వాతావరణ పరిరక్షణలో పోలీసులు ఎదుర్కొనే సవాళ్లు అనే అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీల నిర్వహించారు. ఈపోటీలను పట్టణ సిఐ రాజగోపాల్ నాయుడు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రగతి పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, హిందీ విభాగపు సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛతహి సేవలో భాగంగా ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రగతి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు యశోదా దేవి, సరస్వతి, ఎన్ఎస్ఎస్ పిఒ రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, అధ్యాపకులు గోపాల్ పాల్గొన్నారు.


ప్రతిభా విద్యార్థికి బహుమతి అందజేస్తున్న అధికారులు

పుట్టపర్తి రూరల్ : పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సైబర్ క్రైమ్ నేరాలు నియంత్రణలో యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.


గంగపూజ చేస్తున్న పల్లె రఘునాథరెడ్డి


గంగపూజ చేస్తున్న గ్రామస్తులు

చెరువుల్లో గంగపూజ

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పుట్టపర్తి మున్సిపల్ పరిధిలోని ఎనుములపల్లి చెరువు మరవ పారుతుండడంతో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి గురువారం గంగపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురవడంతో సాగునీటికి, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన నాలుగు మాసాల్లో గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమం కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : మండల పరిధిలోని అప్రాచెరువు చెరువు గ్రామస్తులు గురువారం ఉదయం చెరువులో గంగపూజను నిర్వహించారు. మూడురోజులు క్రితం కురిసిన భారీ వర్షానికి అప్రాచెరువు నిండిపోయింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు గురువారం చెరువులో గంగపూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చెరువులోనినీటితో దిగువన 600 ఎకరాలు సాగు అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అప్రాచెరువు గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

2023-24 విద్యా సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు నవంబర్ 24న స్థానిక జయమనెమ్మ కళ్యాణ మండపంలో ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటరంగయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్టీసీ శ్రీనివాసులు, ˝దిరి నాయి బ్రాహ్మణ డివిజన్ అధ్యక్షులు చిలమత్తూరు కృష్ణమూర్తి మాట్లాడుతూఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని పదవ తరగతిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 480, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 520 మార్కులు పైబడి సాధించిన వారు ఈ పురస్కారాలకు అర్హులు అని అన్నారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలో 850, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు 900 మార్కులు పైబడి సాధించినవారు అర్హులన్నారు. వీరు నవంబర్ 15వ తేదీ లోపు ఎం శ్రీనివాసులు ఆర్టీసీ, డోర్ నెంబర్ 18/1/406 వేణుగోపాల్ నగర్, పాతూరు అనంతపురం చిరునామాకు దరఖాస్తులను పంపించాలన్నారు. ఇతర వివరాలకు 9440501463, 9441222874 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, జిల్లా గౌరవ సలహాదారులు శివ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి విజయనగరం నాగరాజు, జిల్లా కార్యదర్శి శివశంకర్, జిల్లా కోశాధికారి నాగరాజు, నాయకులు జెవి రమణ, బీసీ వరదరాజులు, శివయ్య, ఎక్సైజ్ నరసింహులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల వారోత్సవాలు

ప్రజాశక్తి - తనకల్లు

పోలీసు అమరవీరుల వారోత్సవాలను పోలీసులు గురువారం నిర్వహించారు. మండల పరిధిలోని తోడేండ్లగడ్డపల్లికి చెందిన ఏఆర్. కానిస్టేబుల్ రాచినేని మల్లికార్జున నాయుడు 2023 లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పోలీసులు గురువారం రాచినేని మల్లికార్జున నాయుడు స్వగ్రామానికి వెళ్లి తల్లిదండ్రులను పరామర్శించారు. మల్లికార్జున నాయుడు సమాధి వద్ద పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోపీ, పోలీసులు నారాయణస్వామి, లోకనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5న అనంతకు మందకృష్ణ

ప్రజాశక్తి - కదిరిటౌన్

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు నవంబర్ 5న అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారని ఎంఐఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగేంద్ర తెలిపారు.ఈ మేరకు గురువారం కదిరి పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లాలో ఎంఆర్‌పిఎస్ అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో ఉమ్మడి జిల్లా సదస్సులలో భాగంగా నవంబర్ 5న నిర్వహించే అనంతపురం ఉమ్మడి జిల్లా సదస్సులో మందకృష్ణ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నాగభూషణం, గుండ్రల నాగరాజు, ఆంజనేయులు, రామకృష్ణ, కిష్టప్ప, నరసింహ, విశ్వనాధ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, తదితరులు

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు కదిరప్ప డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం పోస్ట్ కార్డుల ఉద్యమం నిర్వహించారు. కదిరి స్థానిక బస్ స్టాప్‌లో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రతి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు నాలుగు నెలలు కావస్తున్న సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీఎస్ మహమ్మద్, అల్లా బకాష్, గాలివీడు ఉపేంద్ర, రిజ్వానా భాష, నాగరాజు, తేజ, జనార్ధన, రవి, భాస్కర, శ్రీనివాసులు, తిప్పన్న, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

న్యాయవాది అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి -అనంతపురం క్రైం


రుక్సానా(ఫైల్‌ఫోటో)

అనంతపురంలో యువ మహిళా న్యాయవాది అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం రాంపురం గ్రామానికి చెందిన రుక్సానా (27) అనంతపురంలో ఓ న్యాయవాది వద్ద జూనియర్ న్యాయవాదిగా పని చేస్తోంది. కోర్టు రోడ్డులో నివసిస్తున్న ఆమె తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలాన్ని పరిశీలింగా అక్కడి పరిస్థితులు అనుమానంగా ఉండడంతో ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. నేరస్థలం, ఇంటి నుంచి ఆమె వచ్చిన ప్రతి విషయాన్ని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. యువ మహిళా న్యాయవాది మృతిపై న్యాయవాద సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ఘటనపై త్వరితగతిన సమగ్ర విచారణ జరిపించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. టూటౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని ఎస్.రాయాపురం గ్రామానికి చెందిన సిద్ధప్ప కుమారుడు రామకృష్ణ(35) గురు వారం తెల్లవారుజామున ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. రామకృష్ణ రెండేళ్ల నుంచి అనారోగ్యంతో బాధ పడుతు న్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా వ్యాధి న్యాయం కాకపోవడంతో మానసికంగా బాధపడే వాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది తెల్లవారుజామున ఇంటికి సమీపంలో ఉన్న పశువుల కొట్టం పై కప్పు తీరుకు ప్లాస్టిక్ తాడుతో ఉరి వేసుకున్నాడు. ఉదయం నిద్ర లేచిన తర్వాత తెలుసు కున్న గమనించిన రామకృష్ణ తల్లి లక్ష్మమ్మ, తండ్రి సిద్ధప్ప, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం కేసులో మూడేళ్ల జైలు

ప్రజాశక్తి-రొద్దం

మద్యం కేసులో నిందితుడికి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష, రూ. 2 లక్షల జరిమానా విధించినట్లు ఎస్ఐ నరేంద్ర తెలపారు. పెనుకొండ మండలంలోని మావుటూరు గ్రామానికి చెందిన చిన్న అంజనప్ప 2020లో అక్రమంగా కర్నాటక మద్యం తరలిస్తుండగా రొద్దం మండలంలో అప్పటి ఎస్ఐ నారాయణ అరెస్టు చేసి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన జడ్జి బొజ్జప్ప మూడేళ్ల జైలు శిక్ష, రూ. 2 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు, పిపి శ్యామల వాదనలు వినిపించినట్లు కోర్టు కానిస్టేబుల్ కృష్ణమాచారి తెలిపారు.

కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించి ఆరుగురిని అరెస్టు చేసి వారి నుండి 254 కర్నాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. పరిగి మండలం మోదాకు చెందిన మంజునాథ్, హిందూపురం మండలం సంతేబిదనూరుకు చెందిన రవీంద్ర, హిందూపురంలోని మేళాపురానికి చెందిన గోవిందప్ప, పరిగి మండలం బీచుగాని పల్లికి చెందిన తిమ్మప్ప, ఊటుకూరుకు చెందిన లక్కన్నగారి లింగప్ప, శ్రీరంగరాజుల పల్లికి చెందిన వెంకట రెడ్డిను అరెస్టు చేసి మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు పృథ్వీరాజ్, ఫరూక్, హెడ్ కానిస్టేబుళ్లు నరసింహ, రమణ, సతీష్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు ఆంజనేయులు, సురేష్, సుధాకరెడ్డి, శివకుమార్, రవీంద్ర, కుమార్, రంగధామ, ఉస్మాన్, విశాలాక్షి పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణా దారులకు కౌన్సెలింగ్ : కర్నాటక నుండి మద్యం అక్రమ రవాణా చేసే రవాణా దారులకు స్థానిక ఎక్సైజ్ అధికారులు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు సిఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. హిందూపురం ప్రోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల కర్నాటక మద్యం అమ్మకం దారులను స్టేషన్ కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని నల్లగుట్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి గురువారం సాయంత్రం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన నలభై సంవత్సరాల వెంకటరమణ గురువారం సాయంత్రం తన నివాసంలో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన అతని భార్య పెద్దగా కేకలు వేయడంతో చుట్టపక్కల వారు మంటలు ఆర్పారు. స్థానికంగా ఉన్న వందేమాతరం టీం సభ్యులు తక్షణమే తమ అంబులెన్స్ ద్వారా తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటరమణ ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సుంది.

మహిళకు పాముకాటు

ధర్మవరం రూరల్ : ధర్మవరం మండలం బడన్నపల్లికి చెందిన సువర్ణ అనే మహిళ పొలంలో పనిచేస్తున్న సమయంలో పాము కాటుకు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు సువర్ణను ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి తీసుకుని వచ్చి చికిత్స చేయించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల పరిధిలోని బ్రహ్మదేవరమర్రి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు తిరుపాల్ కుటుంబానికి టిడిపి నియోజవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆర్థికసాయం చేశారు. తిరుపాల్ రెండు నెలల మృతిచెందాడు. ఆసందర్భంలో ఇచ్చిన హామీ మేరకు తిరుపాలు కుమారుల చదువుల నిమిత్తం గురువారం 50వేల రూపాయలు అందజేశారు. దీంతో బాధిత కుటుంబసభ్యులు పరిటాల శ్రీరామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్, నాయకులు బాలకృష్ణ, బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి - బత్తలపల్లి

రీ సర్వేలో భాగంగా వచ్చిన భూసమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు. తహశీల్దార్ స్వర్ణలత పేర్కొన్నారు. గురువారం మండలంలోని గరిశలపల్లి గ్రామంలో గ్రామసభను నిర్వహించారు. ఈసదంర్భంగా రైతుల నుంచి 80 అర్జీలను స్వీకరించారు. ఈ గ్రామసభలో సర్వే ఐడి మురళి, రీసర్వే డిటి షణ్ముఖ కుమార్, సర్వేయర్ జోసప్, విఆర్జీలు తలారి చంద్రశేఖర్. విష్ణువర్ధన్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని పోట్లమర్రి గ్రామంలో మండల గణాంకాధికారి డాక్టర్ కెఎస్ లక్ష్మీనరసింహశర్మ ఆధ్వర్యంలో. గురువారం ఆముదం పంటలో పంటకోత ప్రయోగాలను చేపట్టారు. గ్రామానికి చెందిన సాకే శ్రీనివాసులుకు చెందిన ఆముదం పంటలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. అదేవిధంగా దళిత నాగభూషణ పొలంలో కూడా పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ డివిజనల్ కోఆర్డినేటర్ చంద్ర, ఇన్సూరెన్స్ ఏజెంట్లు మంజునాథ, మహేష్, చాంద్‌బాషా, విఎస్ఎ ముత్యాలప్ప, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దళితుడి ఇంటి స్థలం సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అగళి

ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని త్వరలోనే ఏర్పాటు చేసుకోవాలని జిల్లా నాయకులు భాస్కరముని, డాక్టర్ సామ్రాట్ మధు సూచించారు. వారు గురువారం మండలంలో పర్యటించగా ఆలూడి గ్రామానికి చెందిన దళిత ఈరన్న తన ఇంటి స్థలం విషయంలో అగ్ర వర్ణాలకు చెందిన వ్యక్తి నాలుగేళ్లుగా వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సామ్రాట్ మధు ఆ స్థలాన్ని పరిశీలించారు. రెవెన్యూ అధికారులు, ఆలూడి గ్రామ కార్యదర్శి, పోలీసులు స్పందించి ఈరన్నకు ఇచ్చిన స్థలాన్ని కొలతలు తీసి అతడికి అప్పగించాలని కోరారు. లేనిచో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. వారి వెంట జిల్లా గౌరవాధ్యక్షులు నరసింహులు, ఇన్‌ఛార్జి గంగాధర్, మండల నాయకులు ఈరక్యాతప్ప, హనుమంతరాయుడు, భీమరాజు, మండల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు, దండోరా నాయకులు ఉన్నారు.